872) శంకరాభరణం / హుసేని

ప॥ నాకుజెప్పరె వలపు నలుపో తెలుపో । నూకి పోవగరాదు నుయ్యో కొండో ॥

చ॥ పొలతి మరునికి వెరవ పులియో యెలువో । వులుకు తుమ్మెదమోత వురుమో మెరుమో ।
తిలకింప చందనము తేలో పామో । యెలమి కోవిలకూత యేదో పోదో ॥

చ॥ పొదలిన చలిగాలి పొగయో వగయో । వదలిన కన్నీరు వాగో వంతో ।
వుదరమున పన్నీరు వుడుకో మిడుకో । యెదుట తలవంచుకొనుట ఎగ్గో సిగ్గో ॥

చ॥ అసమశరునిపై పరపు టదనో పదనో । పసగలవానిమోవి పంచదారో తేనో ।
అసమగతి వానిరాక ఆదో పాదో । రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో ॥